గుంతలో దిగబడిన లారీలు.. నిలిచిన రాకపోకలు



గుంతలో కూరుకుపోయిన లోడ్ లారీ



లారీలను లాగుతున్న జేసీబీలు

మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామం మీదుగా అధిక లోడుతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే లారీల రాకపోకలతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. శనివారం కురిసిన భారీ వర్షానికి రహదారి గుంతల్లో నీరు చేరాయి. ఈక్రమంలో ఓ గుంతలో ఆదివారం ఉదయం రెండు లారీలు దిగబడిపోయాయి. రెండు జేసీబీలతో లాగినా అవి బయటికి రాలేదు. రాత్రి వరకు ఎంత ప్రయత్నించినా ఫలించలేదు. గుంతలోనే ఉండటంతో.. సిర్పూర్(టి)-కౌటాల ప్రధాన రహదారిలో లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొన్ని వెనుతిరిగి ఆసిఫాబాద్ హైవే మీదుగా వెళ్లగా మరికొన్ని అక్కడే నిలిపేశారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఈ మార్గం గుండా అధిక లోడు వాహనాలకు అనుమతులు ఇవ్వకుండా ఆసిఫాబాద్ హైవే మీదుగా తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సిర్పూర్ (టి)



నిలిచిన వాహనాలు..



రోడ్డుపై బైఠాయించి ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, భారాస నాయకులు

రైతు భరోసా అమలు చేయాల్సిందే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ పథకంపై వ్యవసాయశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ భారాస రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ చౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ముగిసినా ప్రభుత్వం ఇంకా రైతు భరోసా అమలు చేయకుండా రబీ సీజన్ వరకు వివరాలు సేకరించి ఇస్తామని సంబంధిత శాఖ మంత్రి పేర్కొనడం సరికాదన్నారు. ఇది రైతులను మోసం చేసినట్లే అవుతుందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలలో ఏదీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. నాడు భారాస అమలు చేసిన కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, పాఠశాలల్లో అల్పాహారం.. ఇలా అన్ని పథకాలను కోత విధించారని దుయ్యబట్టారు. హామీలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కాలయాపనకే ప్రత్యేక కమిటీలను తెరపైకి తెచ్చారన్నారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, భారాస మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచులు మర్సుకోల సరస్వతి, భీమేశ్, శ్రీనివాస్, బాపురావు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఇది ఉట్నూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బిగించిన సౌరశక్తితో నీళ్లను వేడిచేసే పరికరం(సోలార్ వాటర్ హీటర్). ఇక్కడ 600 మంది గిరిజన విద్యార్థినులు చదువుతున్నారు. సౌర విద్యుత్తు పరికరాలు ఏర్పాటు చేసిన కొన్ని రోజులే పని చేశాయి. ఆ తరువాత ఏమాత్రం నీరు వేడి కావడం లేదని విద్యార్థినులు వాపోయారు. చలికాలంలో చన్నీటితో స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించాలి సారు.. అందించాలి వేడినీరు

● ఆశ్రమ పాఠశాలల్లో నిరుపయోగంగా యంత్రాలు

న్యూస్‌టుడే, ఉట్నూరు



గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అనారోగ్యం బారినపడకుండా వారికి వేడి నీళ్ల సౌకర్యం కల్పించేందుకు సౌరశక్తితో పని చేసే సౌర నీటి యంత్రాలను బిగించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు కలిపి మొత్తం 104 పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అస్వస్థతకు గురికావొద్దనే సదాశయంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ పథకం(ఐఏపీ) నిధులతో తెలంగాణ పునరుద్ధరణీయ వనరుల అభివృద్ధి(టీఎస్ ఎన్ఆర్ఈడీసీ) ద్వారా సోలార్ హీటర్లను బిగించింది. అవి మూన్నాళ్లముచ్చటగా మారాయి.



వేడి నీరు రాక స్నానం చేయడానికి చేతిపంపు వద్ద నీళ్లను నింపుకొంటున్న గిరిజన విద్యార్థినులు(పాత చిత్రం)

ఒక్కోదానికి రూ.3 లక్షలు..

ఒక్కో పాఠశాలలో సౌర పలకలు, సింథటిక్ ట్యాంకు, ఇతర పరికరాలు కలిపి ఒక్కో సౌర వాటర్ హీటర్ ప్లాంటుకు రూ.3 లక్షల వ్యయంతో టీఎస్ఎన్ఆర్ఈడీసీ సంస్థ, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ సహకారంతో వీటిని బిగించారు. మొత్తం 104 పాఠశాలల్లో రూ.3.12 కోట్లు ఖర్చు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేమితో రూ.కోట్లు వెచ్చించి బిగించిన సౌర విద్యుత్తు పరికరాలు నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ గాలికి..

సౌర వాటర్ హీటర్ల కోసం టీఎస్ఎన్ఆర్ఈడీసీకి రూ.3.12 కోట్లను ఐటీడీఏ మంజూరు చేసింది. ఆ సంస్థ పరికరాలను బిగించింది. నిర్వహణ మాత్రం విస్మరించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ఆ సంస్థ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

☛ ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను వివరణ కోరగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.



రాబందుల గుట్టను పరిశీలిస్తున్న బీట్ అధికారులు

అడవులను సందర్శించి.. అవగాహన పెంచుకుని

బెజ్జూరు, పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే : బెజ్జూరు అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న బీట్ అధికారులు ఆదివారం సందర్శించారు. ఆదివారం దూలపల్లి ఫారెస్టు అకాడమీ అసిస్టెంట్ కోర్సు డైరెక్టరు స్వరూపరాణి ఆధ్వర్యంలో.. ఎఫ్‌బీఓలు బెజ్జూరు రేంజ్ పరిధిలో కుశ్నపల్లి సెక్షన్ పరిధిలోని ఇందిర్గాం బేస్‌క్యాంప్, రాముడు, భీముడు వృక్షాలు, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అడవిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పరిశీలిస్తూ.. స్థానిక అధికారులతో అడిగి తెలుసుకుని అవగాహన పెంచుకున్నారు. అనంతరం పెంచికల్‌పేట్ మండలంలోని నందిగామ అటవీ ప్రాంతంలోని రాబందుల గుట్టను సందర్శించారు. అంతరించే దశలో ఉన్న రాబందులను సంరక్షిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఎదురయ్యే సవాళ్లు, వాటిని సంరక్షించిన తీరును సెక్షన్ ఆఫీసర్ జగన్మోహన్ గౌడ్ వివరించారు. టైగర్ ట్రాకింగ్ విధానం, ఇక్కడి పక్షి, జంతువులు, వృక్షజాతుల్లోని వైవిధ్యాన్ని తెలియజేశారు. అనంతరం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కాలువ నిర్మాణాన్ని పరిశీలించారు. ఎఫ్‌బీవోలు అరవింద్ నాయక్, మహేష్, శ్రావణ్‌కుమార్, దినేష్, విజయలక్ష్మి రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ అధికారి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

బెజ్జూరు, న్యూస్‌టుడే : భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాల్వాయి సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురితో సభ్యత్వ నమోదు చేయించారు. రెండు రోజుల్లో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, తిరుపతి, శ్యాంసుందర్, రాజారాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న భాజపా నాయకులు

చారిత్రక కోట.. కావాలి అభివృద్ధి బాట



40 సంవత్సరాల క్రితం ఖిల్లా

ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమైన ఖిల్లా (కోట) నేడు మరికొన్ని రోజులు గడిస్తే ఇక్కడ ఉండేదని చెప్పుకోవాల్సిన పరిస్థితికి చేరింది. ఎన్నో ఏళ్ల నుంచి ఠీవిగా నిలబడి అనేక ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొని ప్రస్తుతం కూలిపోయే దశకు చేరింది. సిర్పూర్(టి)లోని డౌనల్ ఏరియాలో ఉన్న ఖిల్లా ఆనవాళ్లు కాలక్రమేణా కనుమరుగవుతోంది. ఇటీవల 'మన చరిత్రను కాపాడండి' అంటూ స్థానికులు కోరుతున్నారు. - సిర్పూర్(టి), న్యూస్‌టుడే



ప్రస్తుతం ఇలా..

ఇదీ చరిత్ర..

సిర్పూరును పూర్వం సూర్యపురం అని పిలిచేవారు. క్రీ.శ.870లో గోండురాజు భీం భల్లాల్ సింగ్ సిర్పూర్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించినట్లు గోండు చరిత్ర చెబుతోంది. ఈయన హయాంలోనే ఈ ఖిల్లాను నిర్మించగా.. గోండ్రాజుల మైసమ్మ ఖిల్లాగా పిలుస్తూ పూజలు చేసేవారు. ఆయన వంశం 19 మంది గోండు పాలకులు 1735వ సంవత్సరం వరకు చివరి గోండు రాజు నీలకంఠ్‌షా పరిపాలించారు. దీంతో ఈ ఖిల్లాను సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా ఆదివాసీలు చెబుతుంటారు. గోండు వర్గ, ఆదివాసీల ఉనికిని కోల్పోతున్నామని ఖిల్లా చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా చూడాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

ఆక్రమణలతో..

గడిచిన 40 ఏళ్లలో కోట భూమి చాలా వరకు ఆక్రమణకు గురై ముందు ద్వారం మాత్రమే మిగిలింది. ఖిల్లాకు సంబంధించిన రాళ్లు కొంతమంది అపహరించారు. ఖిల్లాకు ఆనుకొని అనేక కట్టడాలు నిర్మించారు. దీంతో పాటు అనేక చెట్లు పెరిగి అధ్వానంగా మారింది.

◆ ఆక్రమణలు తొలగించి చారిత్రక కట్టడాలను రక్షిస్తానని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు లేవని స్థానికులు వాపోతున్నారు. యథేచ్ఛగా ఇక్కడ శాశ్వత కట్టడాలు పెరిగిపోతున్నాయన్నారు. కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే, గత చారిత్రక వైభవాన్ని పరిరక్షించడంతోపాటు అప్పటి చరిత్రను, ఆనాటి కట్టడాలను భావితరాలకు అందించినట్లు అవుతుంది.

ప్రభుత్వానిదే బాధ్యత

- గంట గోపాల్, ఆదివాసీ సంఘ అధ్యక్షుడు

ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలు గోండు రాజుల కాలం నాటి ఖిల్లాను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అనేక త్యాగాలకు ప్రతీకగా చారిత్రక కట్టడాల్లో ఒకటైన సిర్పూర్ ఖిల్లాను ఆక్రమణల నుంచి తొలగించేలా చర్యలు తీసుకొని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది, భావితరాలకు అందించాలి.

31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని.. ఈ నెల 31వ తేదీ వరకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు ఉంటాయని జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తొలి రోజు సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు శోక్ శస్త్ర పరేడ్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు హాజరై పోలీసు అమరుల కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు.



ఎస్పీ శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి సమ్మేళనానికి తరలిన ఏఈవోలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని, పంటల డిజిటల్ సర్వేకు గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలన్న డిమాండ్లతో.. ఆదివారం శామీర్‌పేట్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమ్మేళనానికి జిల్లా నుంచి 40 మంది ఏఈవోలు తరలి వెళ్లినట్లు సంఘ సభ్యుడు చిరంజీవి తెలిపారు. 27 రోజులుగా శాంతియుత నిరసనలు తెలుపుతున్నా. . ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఏఈవోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, జీతభత్యాలు నిలిపి వేయడం, ఒప్పంద ఏఈవోలను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై పునరాలోచించాలని సమావేశంలో పేర్కొన్నట్లు చెప్పారు.

ముక్క మంచిదేనా!

● ఇష్టానుసారంగా మాంసం విక్రయాలు..

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే



పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్, మండలంలో ఆదివారం సెలవు కావడం, మంగళవారం పట్టణంలో వ్యాపార సముదాయాలు బంద్ ఉండటంతో.. ఈ రోజుల్లో మాంసం ప్రియులు కొనుగోళ్లకు మొగ్గుచూపుతారు. వ్యాపారులు విక్రయాల్లో నిబంధనలు పాటించడం లేదు. జీవాలు ఆరోగ్యమైనవేనా లేదా ధ్రువీకరించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో.. వారు ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నారు.

నిబంధనల ప్రకారం.. మేకలు, గొర్రెలను బల్దియాకు చెందిన జంతు వధశాల (కబేలా)లోనే వధించాల్సి ఉంది. విధిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్, పశుసంవర్ధకశాఖ వైద్యుడు పరిశీలించాలి. పురపాలికలో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా.. కబేలాకు వచ్చి వెళ్లిపోవడం తప్ప అక్కడకు తీసుకొచ్చే జీవాల స్థితిని, ఆరోగ్యాన్ని ధ్రువీకరించడం లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, పశువైద్యాధికారి పర్యవేక్షణలో వధించిన మాంసంపై అధికారులు ముద్ర(రౌండ్ సీల్) వేసినది మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. సగానికిపైగా వ్యాపారులు ఇళ్లు, దుకాణాల వద్దనే వధిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా రోగాల బారినపడినవి, వయసు పైబడిన వాటిని కూడా వధించి విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాలనీల్లోని ఇళ్ల మధ్య ఈ తంతు జరుపుతుండటంతో.. అపరిశుభ్రతతోపాటు దుర్వాసన భరించలేకపోతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కాగజ్‌నగర్ మార్కెట్‌లో దుమ్ము ధూళి మధ్య రోడ్లపైనే విక్రయిస్తున్నారు.

క్వింటాళ్ల కొద్దీ..

జిల్లాలో నిత్యం క్వింటాళ్ల కొద్దీ మాంసం అమ్మకాలు జరుగుతుంటాయి. మొన్నటి వరకు దుర్గా నవరాత్రులు ఉండగా.. ప్రస్తుతం విక్రయాలు జోరందుకున్నాయి. పురపాలికలో రోజుకు పదుల సంఖ్యలో వధిస్తుండగా ఆదివారం, మంగళవారం, పండగల సమయాల్లో సుమారు 200లకు పైగా మేకలు వధిస్తుంటారు. దీంతో పాటు మండల వ్యాప్తంగా సుమారు 100-200 మేకలు వధిస్తున్నట్లు అనధికారిక సమాచారం. ఈ లెక్కలు పరిశీలిస్తే.. కబేలాకు ఎన్ని మేకలు తీసుకొస్తున్నారు. ఎన్నింటికి స్టాంపింగ్ వేస్తున్నారో పురపాలిక అధికారులు దృష్టిపెడితే లోపాలు సవరించుకునే అవకాశం ఉంది.

అపరిశుభ్రత నెలకొని..

బల్దియాలో నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం ప్రజారోగ్యం పట్ల అధికారుల తీరుకు అద్దం పడుతోంది. లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే మాంసం విక్రయించాల్సి ఉన్నా.. పట్టణంలోని ఎన్టీయార్ చౌరస్తా, పెట్రోల్‌పంపు ఏరియా, నౌగాం బస్తీ, సర్‌సిల్క్ ఏరియా, మండలంలోని ఈజ్‌గాం చౌరస్తా, భట్టుపల్లి చౌరస్తాలో సైతం దుకాణాలు రోజు రోజుకు పెరిగిపోతున్నా వీటిపై అధికారుల అజమాయిషీ కనిపించడంలేదు. ధరల వివరాల పట్టికను దుకాణాల ఎదుట ప్రదర్శించాల్సి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా దుకాణాలు అపరిశుభ్రత వాతావరణంలోనే కొనసాగుతున్నాయి. ఈగలు, దోమలు మాంసంపై వాలుతున్నా కనీస చర్యలు చేపట్టకుండానే వినియోగదారులకు మాంసం అంటగట్టడం పురపాలికలో షరామామూలే.

చర్యలు తీసుకుంటాం

- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



పట్టణంలోని మాంసం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాల్సిందే. రోగాల బారిన పడిన జీవాల మాంసం విక్రయించినా, అపరిశుభ్రత వాతావరణంలో విక్రయాలు చేపట్టినా చర్యలు తప్పవు. పశువైద్యాధికారితో సమన్వయం చేసుకుని దుకాణాలను పరిశీలించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

త్యాగాల గురుతులు.. సేవల్లో ఘనులు!

● నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం

ఎక్కడ ఏ చిన్న గొడవ జరిగినా, శాంతిభద్రతలకు ఏ మాత్రం విఘాతం కలిగించే ఘటనలు జరిగినా ముందుగా మనకు గుర్తుకొచ్చేది పోలీసులే. సమాచారం ఇవ్వగానే వచ్చేస్తారు. సమాజ హితమే పరమావధిగా నిరంతరాయంగా విరామం లేకుండా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. ఇలా విధుల నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులను, మావోయిస్టులను అరికట్టడంలో 1981 నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లాలో 50 మంది పోలీసులు అమరులయ్యారు. వారి త్యాగాలకు గుర్తుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో స్మారక నిర్మాణాలను నిర్మించి ఏటా అక్టోబరు 21న 'పోలీసు అమర వీరుల సంస్మరణ దినం' పాటిస్తూ నివాళులర్పిస్తున్నారు. వారం పాటు రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

ఆలంపల్లి కాంప్లెక్స్



కడెం మండలం ఆలంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య 1987లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఎస్‌ఐలు, 11 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారు. వీరి జ్ఞాపకార్థం పోలీసు హెడ్‌క్వార్టర్‌లో 'ఆలంపల్లి కాంప్లెక్స్' పేరుతో మూడంతస్తుల భవనం నిర్మించారు.

కోట్యానాయక్ ఉద్యానవనం



ఉట్నూర్ ఎస్ఐగా ఉన్న కోట్యానాయక్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు 1991లో మావోయిస్టులు కొమ్ముగూడెం వెళ్లే దారిలో అమర్చిన మందుపాతరకు బలయ్యారు. ఇందుకు గుర్తుగా కోట్యానాయక్ స్మారకార్థం పిల్లల ఉద్యానవనం ఏర్పాటు చేశారు.

వ్యాయామశాల

బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల సమాచారం చేరవేస్తున్నారని కానిస్టేబుళ్లు శేషు, సంజీవ్‌లను 2000 సంవత్సరంలో తుపాకులతో కాల్చగా వారిద్దరు మృతి చెందారు. ఈ ఇద్దరి పేరిట వ్యాయామశాలను నిర్మించారు.

చక్రపాణి సమావేశ మందిరం

మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ వద్ద 1993లో మావోయిస్టులు ఒక ఇంట్లో దాక్కొని శ్రీరాంపూర్ సీఐగా పని చేస్తున్న చక్రపాణి వెళ్లగా సీఐతో పాటు కానిస్టేబుల్ అశోక్‌పై కాల్పులు జరిపారు. ఆయన పేరుతో 'చక్రపాణి మెమోరియల్ హాలు' నిర్మించారు.

స్మారక స్తూపం

వివిధ సందర్భాల్లో మావోయిస్టుల చేతుల్లో మృతి చెందిన పోలీసుల స్మారకార్థం అమరుల చిత్రాలను వేయించి ఏర్పాటు చేశారు. ఇక్కడే ఏటా అమరులకు నివాళులు అర్పిస్తుంటారు.





అమర వీరుల కాలనీ

విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు కుటుంబాలకు ఆదిలాబాద్‌లో ప్రత్యేక కాలనీని రూ. కోటి వ్యయం చేసి నిర్మించారు. 48 కుటుంబాలకు నివాసాలను నిర్మించారు. పోలీసు అమరవీరుల కాలనీగా నామకరణం చేసిన ఈ కాలనీ రాష్ట్రంలోనే మొదటిది.



గాదిగూడలో వైద్య శిబిరంలో ఔషధాలను అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్‌ఆలం

ఉమ్మడి జిల్లాలో 50 మంది

ఉమ్మడి జిల్లాలో మొత్తం 50 మంది పోలీసులు సంఘ విద్రోహుల చేతిలో అమరులయ్యారు. వీరిలో 48 మందిని మావోయిస్టులు హతమార్చారు. మరో ఇద్దరిని సంఘ విద్రోహ శక్తులు హత్య చేశాయి. వీరిలో ఒక సీఐ, ఏడుగురు ఎస్ఐలు, ఒక ఏఎస్ఐ, 12 మంది హెచ్‌సీలు, 29 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలు ఇవే..

- తిర్యాణి మండలంలో ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి రొంపల్లి-గుండాల, బీంపూర్-మంగి, కడెం మండలం నవాబ్‌పేట-గంగాపూర్ వరకు మట్టి రహదారులు నిర్మించారు.
- సిరికొండ మండలంలో పాలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టారు.
- బజార్‌హత్నూర్ మండలం డెడ్రాలో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేయించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించారు.
- గుడిహత్నూర్‌లో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.
- గాదిగూడ, నార్నూర్ మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు
- ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో ఆదివాసీలకు 1000 దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ఆదివాసీ యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు
- ఏటా వర్షాకాలంలో వాగుల వద్ద వరద ఉద్ధృతి కారణంగా ప్రాణనష్టం జరగకుండా పోలీసు బలగాలను మోహరిస్తున్నారు.
- ఇటీవల విపత్తు నిర్వహణ జిల్లా బృందాలను రెండింటిని అందుబాటులోకి తెచ్చారు. వీరి వద్ద ప్రమాద సమయంలో ప్రజలను కాపాడటానికి అవసరమైన అన్ని పరికరాలు, బోట్లు ఉంచారు
- రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు సరకులు పంపిణీ చేస్తున్నారు.

రైలు ఢీకొని 180 జీవాల మృత్యువాత



పట్టాలకు ఒకవైపు చెల్లాచెదురైన జీవాల కళేబరాలు

సిర్పూర్(టి), కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం ఆరెగూడ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని 180 జీవాలు మృత్యువాతపడ్డాయి. ఇందులో 170 గొర్రెలు, 10 మేకలు ఉన్నాయి. కౌటాల మండలం సిర్సా గ్రామానికి చెందిన జె.భీమయ్యకు 190 జీవాలు ఉన్నాయి. వాటిని మేపేందుకు నిత్యం ఇతర ప్రాంతాలకు సంచరిస్తుంటాడు. ప్రస్తుతం ఆరెగూడ సమీప కాగజ్‌నగర్-బల్లార్షా రైల్వే లైన్ వద్ద తాత్కాలికంగా స్థావరం ఏర్పాటుచేసుకున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది. జీవాల మంద వద్ద కాపలా ఉన్న అతను తలదాచుకునేందుకు సమీపంలోని పాకలోకి వెళ్లి నిద్రపోయాడు. వర్షం ఎక్కువ కావడంతో ఆ జీవాలు చెట్ల కిందకు చేరుకునేందుకు పట్టాలు దాటుతున్న క్రమంలో ఒక్కసారిగా రైలు రావడంతో కిందపడి మృతిచెందాయి. తెల్లవారు జామున మంద కనిపించకపోవడంతో బాధితుడు గాలించగా.. సమీప రైలు పట్టాల వద్ద విగత జీవులుగా కనిపించాయి. 10 మేకలు మాత్రమే బతికాయని, తన జీవానాధారం పోయిందని కన్నీటిపర్యంతమయ్యాడు. దాదాపు రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

శ్వాస అందించి.. ప్రాణాన్ని రక్షించి!



శిశువు

ఇచ్చోడ, న్యూస్‌టుడే : 108 సిబ్బంది సమయానికి చేరుకొని పసిబిడ్డ ప్రాణాన్ని రక్షించిన ఘటన ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం కోలాంగూడకు చెందిన గర్భిణి షబానాకు శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. 108ను సంప్రదించడంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నొప్పులు తీవ్ర కావడంతో ప్రసవం చేశారు. శిశువు ఏడవకపోవడం, శ్వాస తీసుకోకపోవడంతో ఈఎంటీ రాకేష్ కృత్రిమ శ్వాస అందించి ప్రాణం పోశారు. పైలెట్ అలీం తోడ్పాటుతో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉందని, తండ్రి షేక్ లదీమ్ తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్



పూజలు చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలు నిర్వహించారు.

● అమ్మవారిని ఆదివారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శిక్షణ కళాశాల ఎస్పీ బ్రజేశ్‌మిశ్రా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నగదుతో సరిహద్దు దాటుతున్నారా.. జాగ్రత్త!

● మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలు



మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దున కోటపల్లి మండలంలోని రాపన్‌పల్లి(ప్రాణహిత వంతెన) వద్ద తనిఖీలు చేస్తున్న కోటపల్లి పోలీసులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 15న షెడ్యూల్ విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో ఎన్నికల నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలను ప్రారంభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున అవతలి వైపు మహారాష్ట్ర పోలీసులు ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తెలంగాణకు సరిహద్దున ఉన్న మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని అనేక పట్టణాలకు, పల్లెల మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై అవసర నిమిత్తం వెళ్లి వస్తుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, నాందేడ్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలు తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అవసరం నిమిత్తం నగదు తీసుకెళ్లేవారు ఎంతో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో చిన్న పొరపాటు చేసినా ఇబ్బందులు తప్పవు..

రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి..

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరైనా వెంట నగదు తీసుకెళ్లేటపుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఆధారాలు వెంట ఉంచుకోవాలి. రసీదులను తనిఖీ చేసే అధికారులకు చూపాలి. లేనిపక్షంలో సీజ్ చేస్తారు. అదేవిధంగా నగదుతో పాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా.. రసీదు తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలి. వస్తువుల కొనుగోలు, అమ్మకాలతో పాటు బిల్లుల చెల్లింపులు చేసినా రసీదు తప్పనిసరిగా కలిగిఉండాలి. నగదు వెంట తీసుకెళ్లేటపుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఆధారాలను వెంట పెట్టుకోవాలని ఎన్నికల అధికారులు ప్రకటనల ద్వారా సూచిస్తున్నారు. తనిఖీలో నగదు దొరికితే.. ఆధారాలు చూపించిన తిరిగి పొందాల్సి ఉంటుంది. మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల ప్రజలు వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలను సరిహద్దున ఉన్న తెలంగాణలోని వివిధ పట్టణాలకు వస్తుంటారు. జిల్లా వాసులు మహారాష్ట్రకు వెళుతుంటారు.

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పట్టణాలు, ప్రాంతాలు..

- నిర్మల్ జిల్లాలోని ముథోల్, బాసర, కుంటాల, సారంగాపూర్, కుబీర్ మండలాలు మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నాయి.
- మహారాష్ట్ర.. నాందేడ్ జిల్లాలోని ధర్మాబాద్ మహోర్ ఉమ్రి, కిన్వాట్, ముత్తేడ్, లోహా.
- కుమురంభీం జిల్లాలోని బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), వాంకిడి, కెరమెరి, జైనూర్
- మహారాష్ట్ర చంద్రపూర్, గడ్చిరల్లి జిల్లాల్లోని జమితి, రాజురా, లక్కర్‌కోడ్, కోడ్సా, అహేరి
- మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లి మండలాలు మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నాయి.
- మహారాష్ట్ర.. గడ్చిరోలి జిల్లాలోని సిరోంచ, అంకిసా, ఆసరల్లి, మొట్లగూడెం, తదితర ప్రాంతాలు తెలంగాణకు ఆనుకొని ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తాంసి, తలమడుగు...
- మహారాష్ట్రలోని యవత్మాల్ నాందేడ్, చంద్రపూర్ జిల్లాల్లోని మాండివీ్వ, బోరి, పిప్పల్‌కుట్టి, పాంఢ్రకవడ ప్రాంతాలు..

దేవత పూజలకు గానుగ నూనె సిద్ధం



గానుగలో నువ్వుల నూనెను తీసేందుకు కర్రను తిప్పుతున్న యువకులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఆదివాసీ గిరిజనులు మరో వారం రోజుల్లో దండారీ ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఉపవాస దీక్షతో ఆదివారం ఇంద్రవెల్లి మండలం పొల్లుగూడలో మహాలక్ష్మీ దేవత పూజల కోసం గూడెంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గానుగ ద్వారా నువ్వుల నూనెను తీస్తున్నారు. ఆదివాసీ గోండు, కొలాం గిరిజనుల దేవతలకు పూజల సందర్భంగా ప్రత్యేకంగా గానుగలో తీసిన నువ్వుల నూనెతోనే దీపం వెలిగించి దేవతలకు మొక్కుతామని, దీపావళి పండగ సందర్భంగా ఇంటి ముందర ఏర్పాటు చేసే దీపాలను సైతం నువ్వుల నూనెతోనే వెలిగిస్తామని ఆదివాసీ మహిళలు మెస్రం లక్ష్మీ, సీడాం జంగుబాయి తదితరులు తెలిపారు.

సరదా ఆట.. ఆరోగ్యబాట



ఆర్కేపీ తారకరామ కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లో ఆడుతున్న చిన్నారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : ఆదివారం వచ్చిందంటే చాలు చిన్నారులకు పట్టరాని సంతోషం. పుస్తకాలను పక్కన పెట్టి వారికి నచ్చిన ఆటలు ఆడుతూ ఆనంద పడుతుంటారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని క్యాతనపల్లి పుర పరిధిలోని జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గతంలో అయిదు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ప్రతి చోట ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు వార్డుల్లో నిర్మాణ పనులు కొనసాగుతుండగానే చిన్నారులు ఓపెన్ జిమ్‌లో ఇలా ఆనందంగా గడుపుతున్నారు. చిన్నారుల ఆటమైదానం పనులు కూడా త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

23న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 కబడ్డీ పోటీలు ఈ నెల 23న బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల(కాసిపేట)లో నిర్వహించనున్నట్లు డీఐఈఓ అంజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.బాబురావు తెలిపారు. బాలురకు కాసిపేట పాఠశాలలో, బాలికలకు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలకు ఇంటర్ చదువుతున్న 19 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్ కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు 18 మంది పశువైద్యాధికారులు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో పశుసంవర్ధక శాఖ పరిధిలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు జిల్లాకు 18 మందిని కేటాయించింది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో వారు విధుల్లో చేరారు. కొత్తగా పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	పశువైద్యశాల
లావణ్య	తలమడుగు
విజయ్‌కుమార్	ముత్నూర్
శ్రీకాంత్	గుడిహత్నూర్
వంశీకిరణ్	శాంతాపూర్
దీపరతన్	ల్యాబ్, ఆదిలాబాద్
మహమ్మద్ అబ్దుల్	పొన్కల్
సంపత్	నెన్నెల
పరిమళ	కాగజ్‌నగర్
రమేశ్	దహెగాం
సౌందర్య	కడెం
ప్రియాంక	కుంటాల
సంధ్యారాణి	రేవాజీపేట
శరణ్య	ఇందాని
అంజలి	ముత్యంపేట
సురేశ్	కెరమెరి
కార్తీక్	రెబ్బెన
భవిత	సిర్పూరు(టి)
రత్న సుప్రియ	వేమనపల్లి

అండగా ఉంటూ.. ఆర్థికంగా చేయూతనిస్తూ..

● బాధిత కుటుంబాలకు స్నేహితుల భరోసా



పంచగుడిలో శ్రీకాంత్ తండ్రి గంగాధర్‌కు నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: పదోతరగతి పూర్తి కాగానే మిత్రులలో దాదాపు సగానికి పైగా విడిపోతారు. ఇందులో కొందరు ఆర్థిక పరిస్థితులతో చదువు మానేసి కుటుంబ పోషణలో భాగమవుతుంటే మరికొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడుతుంటారు. ఇలా మూడు దశాబ్దాల కిందట పదో తరగతి పూర్తి చేసుకుని ఉద్యోగంలో స్థిరపడ్డ కొందరు ఆనాడు తమతో చదువుకున్న స్నేహితులలో ఎవరికి కష్టమొచ్చినా మేమున్నామంటూ భరోసానిస్తున్నారు. లోకేశ్వరం మండలం పంచగుడి, ధర్మోర గ్రామాలకు చెందిన కొందరు యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట గ్రూపు ఏర్పాటు చేసుకుని స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2014లో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికై తెలుగు రాష్ట్రాల్లో కొలువులో ఉన్న కొందరు పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పడి తమతో శిక్షణ పొందిన ఎస్సై కుటుంబాల్లో ఎవరికి ఆపదొచ్చినా వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. ప్రస్తుతం ఆత్మీయ సమ్మేళనాలతోనే సరిపెట్టుకుంటున్న పూర్వ విద్యార్థులు కూడా ఈ దిశగా ఆలోచిస్తే ఎన్నో కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

రక్తబంధం కాదు.. రక్షక బంధంతో...

2014 ఎస్సై బ్యాచ్‌లో 1100 మంది శిక్షణ పొందగా, 746 మంది సభ్యులు పోలీసు సోషల్ వెల్ఫేర్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వీరిప్పుడు తమతో పాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ ఒక్క కుటుంబానికి ఆపదొచ్చినా పలకరిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు. వీరు ఇప్పటి వరకు మరణించిన, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు రూ.82.50 లక్షల ఆర్థిక సాయం అందజేసి తమది రక్తసంబంధం కాకపోయినా రక్షక బంధాన్ని చూపామంటున్నారు.

మూడు దశాబ్దాలు దాటినా...

బెల్లంపల్లి గురుకులం 1989-90 బ్యాచ్ పదో తరగతి మిత్రులు నేటికీ అప్పుడప్పుడు కలుసుకుంటూ కష్టసుఖాలు పంచుకుంటున్నారు. వీరితో పాటు పదో తరగతి పూర్తి చేసుకున్న లోకేశ్వరం మండలం పోట్‌పెల్లి(బి) వాసి సాయన్న 2022లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మిత్రులు సాయన్న తల్లిదండ్రుల దీనస్థితిని చూసి చలించిపోయారు. తలా కొంత పోగు చేసి రూ.53వేల ఆర్థిక సాయం అందజేశారు. మంచిర్యాలకు చెందిన మరో మిత్రుడు కమలాకర్ గుండెపోటుతో నాలుగు మాసాల కిందట మరణించారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు తలా కొంత పోగు చేసి రూ.1.75 లక్షలను ఆ పిల్లలకు అందజేశారు.

యువకులంతా ఒక్కటై..

పంచగుడి, ధర్మోర గ్రామాల యువకులు 50 మంది తమలో ఏ ఒక్కరికి కష్టమొచ్చినా దాన్ని కొంతవరకైనా పూడ్చాలని హెల్పింగ్ హ్యాండ్స్ అనే గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఒకరిగా ఉన్న పంచగుడి వాసి సలీం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి రూ.30 వేలు, వారం రోజుల కిందట అదే గ్రామవాసి శ్రీకాంత్ గుండెపోటుతో మరణించగా ఆయన తండ్రి గంగాధర్‌కు రూ.75 వేల ఆర్థిక సహాయం చేశారు.



ఉద్యోగులతో కలిసి నృత్యం చేస్తున్న ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ

సందడి చేసి.. ఉత్సాహపరిచి..



నృత్యం చేస్తున్న యువతి

ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ స్టెప్పులు వేసి సహ ఉద్యోగులను ఉత్సాహపరిచారు. ఆదివారం ఆదిలాబాద్ గాయత్రి గార్డెన్‌లో తపాలా శాఖ ఆదిలాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఫెస్ట్-ఓ-పోస్ట్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. తపాలా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నృత్యాలు చేసి అలరించారు. పాటలు ఆలపించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉప పర్యవేక్షకుడు లవకుశ్, ఐపీవోలు ఎన్.రాజు, దిలీప్, కల్యాణ్, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, ఎఫ్ఎన్‌పీవో ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేశ్, ఆలిండియా జీడీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఆదిలాబాద్ డివిజన్ కార్యదర్శి గట్టు శ్రీనివాస్, తపాలా సిబ్బంది ఉన్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

కౌటాల, న్యూస్‌టుడే:

? కౌటాల గ్రామ శివారు తాటిపెల్లి చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారి పక్కనే దుకాణదారులు వ్యర్థాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను పడేస్తున్నారు. దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీపంలో వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలి.
- ప్రశాంత్, కౌటాల

✔ మండల కేంద్రంలోని దుకాణదారులు, చికెన్‌షాపుల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపక్కనే పడేస్తుండటంతో సమస్య ఎదురవుతోంది. ఈ విషయంపై నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం. పడేయకుండా చర్యలు తీసుకుంటాం.
- సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:

? ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై విద్యుత్తు దీపాలు లేక ప్రమాదకరంగా మారింది. పక్కనే గల్లీ ఉండటంతో ప్రధాన రహదారిపైకి వచ్చే వాహనాలు రాత్రి సమయంలో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. **- సోగాల రమేష్, సిర్పూర్(టి)**

✔ త్వరలోనే పరిష్కరిస్తాం. వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

? జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు కాలనీలో ఎమ్మెల్యే ఇంటి ముందు గల్లీలో చెత్త సేకరణ వాహనం పక్షం రోజులుగా రావడం లేదు. ఇళ్లలోనే చెత్త నిల్వలు పెరిగాయి. దుర్వాసన వస్తోంది. పుర అధికారులు స్పందించి చెత్త సేకరణ వాహనం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- రమేశ్, కాలనీవాసి.

✔ వెంటనే వాహనం పంపించేలా చర్యలు తీసుకుంటాం.
- భుజంగ్‌రావు, పుర కమిషనర్

ఆవరించి.. రహదారిని మూసేసి!



కాగజ్‌నగర్ పట్టణం కౌసర్‌నగర్ ఏరియాలోని ఓ గల్లీ రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఆవరించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పొదలు దారిని పూర్తిగా కమ్మేశాయని ఈ విషయమై రెండు నెలల నుంచి మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ స్పందించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అత్యవసర వేళల్లో 108 అంబులెన్స్ వాహనం కూడా ఈ మార్గంలో రాలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం**

చెట్టంత నిర్లక్ష్యం!

సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో వేంపల్లి బ్రిడ్జి ముందున్న అటవీ ప్రాంతంలో నెల రోజుల కిందట కురిసిన వర్షాలకు ఓ చెట్టు రహదారిపైకి ఒరిగింది. నిత్యం అనేక సంఖ్యలో వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెల రోజులు గడుస్తున్నా చెట్టును తొలగించకపోవడంపై ప్రజలు అధికారుల వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారిపై అడ్డంగా పడిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)**



సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో పడిన చెట్టు కొమ్మలు

ప్రహరీ కూలినా పట్టించుకోరు



కౌటాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ ఏడాది కిందట కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. కార్యాలయ ఆవరణలోకి పశువులు, శునకాలు వస్తున్నాయి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన ప్రహరీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, కౌటాల**

జోరుగా గంజాయి విక్రయాలు!

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ మండలంలోని ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలో గల్లి గల్లీలో గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. 13 బెంగాలీ గ్రామాల్లో గంజాయికి అలవాటుపడిన యువత పక్కదారి పడుతున్నారు. కొంత మంది గంజాయి వ్యాపారాన్ని వృత్తిగా ఎంచుకుని కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి ఈ గ్రామాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా విలేజ్ నం.3, 12లో కొంత మంది స్మగ్లర్లు పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి యువతకు విక్రయిస్తున్నారు. పోలీసులు అడపాదడపా నిఘా పెట్టి పట్టుకుంటున్నారే తప్ప పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం యథేచ్ఛగా కొనసాగుతున్నందున చదువుకుంటున్న యువత సైతం పెడదారి పడుతోంది. ఇక్కడ పనిచేస్తున్న పోలీసులకు కాగజ్‌నగర్ పట్టణ విధులను కేటాయించడంతో పూర్తి స్థాయిలో ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ సమస్యలపై దృష్టి పెట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల పోలీసులను పూర్తిగా కాగజ్‌నగర్ పట్టణ విధులకే పరిమితం చేస్తున్నందున ఈజ్‌గాం పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈజ్‌గాం పోలీసులను పూర్తి స్థాయిలో ఇక్కడి విధులకే పరిమితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుప్తనిధుల తవ్వకాలు చేస్తున్న వ్యక్తుల అరెస్ట్

జైపూర్, న్యూస్‌టుడే : ఇందారం గ్రామంలో ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు సాంబయ్య అనే వ్యక్తి ఇంట్లో తవ్వకాలు చేస్తున్న అదే గ్రామానికి చెందిన వెన్న రాజేష్, వెంకటి, కాళ్ల కొమురయ్య, బద్దెల ప్రసాద్, వెన్నకుమార్‌లతో పాటు శ్రీరాంపూర్‌కు చెందిన ఐలయ్య, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం సోనాపూర్‌కు చెందిన కొమురం గంగు, అర్కబీం, శ్రీరాం తిరుపతి, రమేష్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి గడ్డపార, తట్ట, పారలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

భారాస నాయకుల నిరసన



కాగజ్‌నగర్‌లో రోడ్డుపై బైఠాయించిన భారాస నాయకులు



కెరమెరిలో నినాదాలు..

రెబ్బెన, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రహదారిపై రైతులకు రైతు భరోసా డబ్బులు చెల్లించాలని నిరసిస్తూ.. ఆదివారం భారాస ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సింగిల్‌విండో ఛైర్మన్ కార్యాలయం సంజీవ్‌కుమార్, వైస్ ఛైర్మన్ రంగు మహేష్‌గౌడ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్థాయి మించిన హామీలు ఇచ్చిందని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టి ప్రభుత్వానికి నిరసనగా ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోగా రూ.రెండు లక్షల రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయలేదని ఆరోపించారు. రైతు భరోసాతో పాటు రుణమాఫీని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాబురావు, మాజీ సర్పంచి పోచమల్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంగం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచి బి.శ్రీధర్, నాయకులు కుందారపు శంకరమ్మ, అజయ్, వినోద్‌జైస్వాల్, మధునయ్య, ఆనంద్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కెరమెరి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే నెరవేర్చాలని మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం డిమాండ్ చేశారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలో భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో భాగంగా.. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి, అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

తిర్యాణి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, భారాస శ్రేణులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రైతు భరోసాతో పాటు రుణమాఫీ ఏక కాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచులు గుణవంతరావు, బాపిరావు, లచ్చన్న, కట్టి, నాయకులు రాజయ్య, శంకర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో భారాస ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు. ఆరు గ్యారంటీలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని, రైతు భరోసా, బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పట్ల ప్రభుత్వం, పోలీసుల చర్యలు తప్పుబట్టారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లెండుగురె శ్యాంరావు, కౌన్సిలర్ మినాజ్, నాయకులు మోయినోద్దీన్, ముస్తఫిజ్, ఓదెలు, సలీం, దాసరి నరేందర్, శోభన్, పార్వతి అంజయ్య, వరలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



తిర్యాణి: కుమురం భీం చౌరస్తాలో భారాస నాయకుల ధర్నా



రెబ్బెనలో..

సంచార జీవనం.. భద్రతలేని దైన్యం!

కౌటాల, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే :

గొర్రెలు, మేకలు పోషిస్తూ జీవనం సాగించే వారు.. సొంత గ్రామంలో పక్కా భవనాలు ఉన్నా జీవనం సాగించేది మాత్రం ఆరుబయటే. తమ జీవాల మేత కోసం ఏడాదంతా సంచార జీవనమే. జీవాలను కాపాడుకునేందుకు రాత్రంతా జాగరణ చేయాల్సిందే. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. వారి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. శనివారం రాత్రి సిర్పూర్(టి) మండలం ఆరెగూడ సమీపంలోని గొర్రెలు, మేకల మంద పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు కింద పడి 180 జీవాలు మృత్యువాత పడటమే దీనికి నిదర్శనం. బాధితుడు భీమయ్యకు దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లడంతో ఆ కుటుంబం కోలుకోలేని పరిస్థితి.

కౌటాల మండలంలోని సిర్సా గ్రామంలో 300 కుటుంబాలు గొల్లకుర్మలవే. గొర్రెలు, మేకల పోషణే వారి ప్రధాన జీవనాధారం. జీవాల మేత స్థానికంగా దొరకపోవడంతో సొంతూళ్లలో ఉండలేని దుస్థితి. వాటిని పోషించుకునేందుకు నిత్యం అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి సంచార జీవనం గడపక తప్పని పరిస్థితి. భార్య, పిల్లల సమేతంగా గ్రామ వెలుపల ఉన్న పొలాల్లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని ఎండా వానకు ఓర్చి జీవనం సాగిస్తుంటారు.



జీవాలను పడవ గుండా మహారాష్ట్రకు తరలిస్తున్న కాపరులు

వందల కిలోమీటర్లు వలస..

సిర్పూర్ నియోజకవర్గంలో సిర్సా గ్రామానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. గొర్రెలు, మేకల పెంపకం వారి ప్రధాన జీవనాధారం. జీవాలకు స్థానికంగా మేత లేక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వందల కిలోమీటర్లు దూరం వలస వెళ్లి అడవుల్లోనే గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తుంటారు. వందల కిలోమీటర్లు వలస వెళ్లిన వారికి జీవాలకు ఏదైనా వ్యాధి సోకినా స్థానిక పశువైద్యుల నుంచి ఎలాంటి సహకారం ఉండదు. కాపరులే వైద్యం అందిస్తుంటారు. అంతేకాకుండా జీవాలకు బీమా చేసుకోవాల్సిన అవసరంపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం లేదు. దీంతో ప్రమాదం జరిగితే నష్టపోవాల్సి వస్తోంది.

అడుగడుగునా ఇబ్బందులే..



జీవాలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటాం. అటవీ అధికారులు, స్థానికులతో నిత్యం ఇబ్బందులు పడుతూ జీవనం సాగించాల్సిన పరిస్థితి. మందలతో అటవీప్రాంతాల్లో ఉంటుండటంతో వన్యప్రాణులతో సైతం భయం భయంగా ఉండాల్సి వస్తుంది.
- శ్రీశైలం, సిర్సా గ్రామం

బుద్ధుడి మార్గం అనుసరణీయం

వాంకిడి, న్యూస్‌టుడే: బుద్ధుడు చూపిన మార్గం అనుసరణీయమని బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మహోల్కర్ అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖమనలో వర్షవాస్ గ్రంథ పఠనం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా నాయకులు శ్యాంరావు, వినేష్, తుకారాం, విజయ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బౌద్ధ మహాసభ అధ్యక్షుడు మహోల్కర్ అశోక్

ఇంటింటికీ తిరిగి.. సభ్యత్వం నమోదు చేసి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్పందన లభిస్తోందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని కోసినిలో ఇంటింటికీ తిరిగి భాజపా సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత సభ్యత్వ నమోదుకు వరుస కడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోనూ భాజపా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. పారదర్శక పాలనను అందిస్తున్న భాజపాకు గ్రామాల్లో చదువుకున్న యువత స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, బాబురావు తదితర నాయకులు పాల్గొన్నారు.



కోసినిలో నమోదు చేస్తున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ పట్టణంలోని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో.. ఆదివారం నవేగాంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సేవా సమితి కన్వీనర్ కె.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా నవేగాంలో 99వ భజనమాలతో స్వామి పాదాల చెంత సమర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్, సేవాసమితి కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు.



నవేగాం ఆలయంలో భక్తజనసందడి

ఆర్పీల వేతనాలు విడుదల చేయాలి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పురపాలికలోని మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీ (రీసోర్స్ పర్సన్లు)ల వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పలువురు ఆర్పీలు సీఐటీయూ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం సరి కాదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆర్పీల పాత్ర కీలకమని, ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వేతనాలను నేరుగా ఆర్పీల ఖాతాల్లో జమ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు రూ.10 లక్షల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నగరం మధు, పద్మ, యూనియన్ అధ్యక్షురాలు మాధురి, కార్యదర్శి కవిత, ఉపాధ్యక్షురాలు సునీత, సహాయ కార్యదర్శులు స్వర్ణ, రమ్య, కోశాధికారి స్రవంతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్

వేతన బకాయిలపై..

ఎదులాపురం: జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంల ఏడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి స్పందించి వేతనాలు చెల్లించని గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏఎన్ఎంల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల అధ్యక్షులు బొజ్జ ఆశన్న, రాజేందర్, ఏఎన్ఎంల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కమల, ఆర్.అనిత, శ్యాంసుందర్, నర్మద, కావేరి తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాల్సిందే

బెజ్జూరు, న్యూస్‌టుడే : ప్రోటోకాల్ పాటించని ప్రాథమిక వ్యవసాయ సంఘం సీఈఓ బక్కయ్యపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ను ఆహ్వానించలేదని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించారన్నారు. సీఈఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనపై జిల్లా పాలనాధికారి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టరు రాజారాం, నాయకులు విష్ణుమూర్తి, జాహీద్‌హుస్సేన్, మురళీగౌడ్, బాబాజీ, అంకయ్య, లక్ష్మణ్, ప్రశాంత్, వినోద్, బాపురావు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జ్వరంతో యువకుడి మృతి



అంజన్న

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన వడ్గూరి అంజన్న(17) అనే యువకుడు జ్వరంతో మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజన్న కొన్నిరోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లాలని వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సమావేశాలు నిర్వహించాలని డిమాండ్

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : సింగరేణిలో ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘంతో యాజమాన్యం నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించాలని సీఐటీయూ ఏరియా బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం రామకృష్ణాపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి పది నెలలు గడుస్తున్నా యాజమాన్యం ఇంత వరకు ఎలాంటి సమావేశం నిర్వహించలేదని మండి పడ్డారు. రామస్వామి, రాజేందర్, సురేష్ పాల్గొన్నారు.



భీం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆదివాసీ నాయకులు

కుమురం భీంకు ఘన నివాళి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కుమురంభీం వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం డాడానగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ సిడాం గణపతి మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం గిరిజనుల విముక్తి కోసం వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన భీం ఆశయాలను నెరవేర్చాలని పేర్కొన్నారు. దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ గిరిజనుల హక్కులు పూర్తి స్థాయిలో అమలు కావడంలేదని తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాయి సెంటర్ నిర్వాహకులు సుర్పం మారు, మడావి భీంరావు, నాయకులు నైతం శ్యాంరావు, ఆత్రం రాంషా, మర్సుకోల చందు, ముఖషి, సుర్పం మురళీ, సుర్పం రాంచందర్, మర్సుకోల లాను, సుర్పం జంగుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో జాప్యం తగదు

శ్రీరాంపూర్ గ్రామీణం: ఏటా జూన్‌లో ప్రకటించాల్సిన పదోన్నతులను ఇప్పటికీ ప్రకటించకపోవడం అన్యాయమని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ యాజమాన్యం చేస్తున్న జాప్యంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

సంకల్పం ముందు వైకల్యం ఓడింది

కౌటాల, న్యూస్‌టుడే:

శరీరంలో సగ భాగం సహకరించకపోయినా సంకల్పం అతన్ని ముందుకు నడిపిస్తోంది.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులకు గురిచేసినా, వైకల్యం బాధపెట్టినా కుంగిపోలేదు.. పూర్తిగా నిలబడలేని స్థితిలోనూ ఏనాడు అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసమే ఆలంబనగా చేసుకుని పట్టుదలతో టీవీ రిపేర్ నేర్చుకున్నారు.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిష్ టీవీలు అమర్చుతూ తన పనితనంతో అందరినీ మెప్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. కౌటాల మండల కేంద్రానికి చెందిన మెస్రం కౌలు.

మెస్రం కౌలు స్వస్థలం మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా హివ్‌రా గ్రామం. అయిదేళ్ల వయసులో పోలియో సోకడంతో నడవలేని స్థితి. నాలుగో తరగతి చదివే సమయంలో తండ్రి గజానన్ మృతితో తల్లి కాసుబాయి కూలీ పనులు చేసి ఇంటర్మీడియట్ వరకు చదివించింది. పైచదువులకు వెళ్లలేని కుటుంబ పరిస్థితి కారణంగా.. సొంతంగా ఉపాధి సమకూర్చుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో టీవీ రిపేరింగ్ మెలకువలు నేర్చుకున్నారు. ఇంటింటికీ వెళ్లి రిపేరింగ్ చేస్తూ ఆదాయం గడిస్తూ తల్లికి చేదోడుగా నిలిచారు. 2015లో కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన యువతితో వివాహం కావడంతో.. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ స్థిరపడ్డారు. మారుతున్న కాలానుగుణంగా మార్కెట్లోకి స్మార్ట్ టీవీలు రావడంతో తన టీవీ రిపేరింగ్ వ్యాపారం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఈ సమయంలో ఎలాంటి కుంగుబాటుకు లోనుకాకుండా ప్రజలు ఎలాంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారో గ్రహించి ఆవైపు ఆలోచన చేశారు. ప్రసార మాధ్యమాలైన డిష్‌టీవీ, టాటాస్కై, సన్‌డైరెక్ట్ వంటివి ఇళ్లకు బిగిస్తే మంచి ఆదాయం వస్తుందని గ్రహించి ఈమేరకు ఏడాది పాటు శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం స్వయంగా వెళ్లి వీటిని అమర్చుతూ మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నారు.



నిచ్చెన ఎక్కి డిష్ కేబుల్ పనులు చేస్తున్న కౌలు

డిష్ టీవీలు అమర్చేందుకు మూడు చక్రాల బండిపై వెళ్లే క్రమంలో తనను చూసి ఈ పనులు నువ్వు ఎలా చేయగలవు అంటూ ఆశ్చర్యంగా చూసిన వారే, తన పనితనాన్ని చూసి మెచ్చుకుంటున్నారని కౌలు చెబుతున్నారు. ఆత్మస్థైర్యం మరింత రెట్టింపు అవుతుందంటున్నారు.